# యెవరిగతి యెటులనున్నదో!

జనం గుంపులుగా వెళ్తున్నారు. మార్కెట్ నించి బస్‌లో వచ్చిన వసంతకి కుతూహలం కలిగింది. రెండు చేతుల్లో కూరలతో నిండి ప్లాస్టిక్‌సంచీలున్నాయి. బుజానికి హేండ్‌బాగ్ వేలాడుతున్నది. అదీ బరువే. దానిలో ద్రాక్షా కమలా పొట్లాలున్నాయి. బస్ కొండ దిగువన ఆగింది. అక్కడ టీ స్టాల్, పాన్ షాప్, కాంటీన్ బేకరీ వున్నాయి. అది చిన్నవాల్తేరు జంక్షన్.

కండక్టర్ రాజు బాగా తెలుసు వసంతకి. దసరా మామూలు కోసం వస్తాడు రాజు. కింద నిలబడి, దిగే స్త్రీలను చూస్తున్నాడు. టికెట్ అందుకుంటున్నాడు. దిగుతున్న వసంతను చూశాడు. కూరల సంచీలందుకున్నాడు. వసంత దిగింది.

'' ఇవాళ మరీ కొన్నారమ్మా?'' అన్నాడు నేల మీదుంచుతూ.

''యేమిటా జనం? యేం జరిగిందో!'' అన్నది టికెట్ అందిస్తూ.

''వెళ్లి చూసొస్తారా? రానీయటం లేదనుకుంటా. పదిన్నరా లేదా పదకొండింటికి హత్య జరిగింది. ఇంట్లో యెవరూ లేరని కనిబెట్టే చేశారు. వెళ్లిరావాలనుంటే వెళ్లిరండి. నేనూ డ్రైవరూ టీ తాగి కూచుంటాం. ఇంజన్ చల్లారాలి. సంచీలుండనీయండి. నే చూస్తా. వాటితో పైకి యెక్కలేరు''.

తలవూపి బయలుదేరింది వసంత. హేండ్‌బాగ్ బరువుగానే వున్నది. రెండువేపులా చూస్తూ పైకి నడక సాగించింది. అంతస్తుల భవనాలూ, యిళ్లూ, పెంపుడు కుక్కలు, పిల్లలూ, పూలమొక్కలూ గోడమీద నించి వాలి వున్న పూలతీగలూ చూస్తూ కుడివేపు తిరిగింది. కూడా మనుషులూ. యెడమవేపు తిరగాలి. విడిగా యిళ్లూ, మళ్ళా అంతస్తుల భవనాలూ. పార్క్ గోడవేపు వెళ్లి యెడమవేపు తిరగనే లేదు. పోలీస్ వాన్. రక్షణ శాఖ వారు అందర్నీ రానీయటం లేదు. అక్కడ గుంపుగా వున్నహరి వెనకగా దగ్గరగా నిలబడి చూసింది. తలో మాటా అంటున్నారు.

'పెద్ద కుక్కే పెంపుడుదే వున్నది. అరవ లేదుట. తెలిసినవాళ్లే వచ్చారని చూస్తూ వుండిపోయిందేమో. లేదా మత్తు యెక్కే మాంసాహారం పెట్టారేమో

హంతకులు'' రక్షణశాఖ వారంటున్నారు. ''కట్టేసి వున్నదట. మేడమీద అటువేపు వరండాలో వున్నదిట''. ''యెపుడు యెవరు చూశారు? యెలా తెలిసిందీ? ఫోన్ చేశారా?''

''పదిన్నర పదకొండు గంటల ప్రాంతాల భర్త, రిటైరైనాయనే, ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో జాబ్‌చేస్తున్నాడు, కారులో యింటికి వస్తాడు. నర్సింగ్‌హోమ్ దూరమే. దోవలో జామ్ అయి, ఆలస్యంగా వచ్చాడుట. వీధి గేటు తీసి వున్నది. అనుమానిస్తూనే వచ్చి కారాపి, పైకి వెళ్లాడు. డౌన్ స్టేర్స్‌లో అద్దెకున్నవాళ్లు, కైలాసగిరి చూచి రావటానికి స్వంత కారులో పొద్దున్నే బయలుదేరి వెళ్లారుట. తీసి వున్న తలుపులు చూస్తూ వెరుస్తూ అన్ని వైపులాగమనిస్తూ లోపలికి వెళ్తే డ్రాయింగ్ రూమ్‌లోనే సోఫా వెనక నేలమీద పడివున్న భార్య కంటబడింది భర్తకి. పెనగులాడే వుండాలి. దాక్కోవాలని ప్రయత్నించి వుండాలి. ఫర్నిచరంతా చిందరవందరైంది. నైలాన్‌తాడుతో చేతులు వెనక్కి కట్టేశారు. గొంతుకి నైలాన్ తాడే. బిగిసిపోయింది'' అన్నదో నిబ్బరంగల నడివయస్కురాలు. పనివాళ్లూ, పాలు పోసేవాళ్లూ వచ్చారు.

''కక్షగాదు. సొమ్ము కోసమే'' అన్నాడో కూలి మనిషి.

''యెంతపోయి వుండాలి?''

'' ఆమె వంటిమీదే లక్ష విలువచేసే నగలున్నాయి. రవ్వల కమ్మలు, రాళ్ల గాజులు, రవ్వముక్కు పుడక. రవ్వ వుంగరం. సూత్రాలమీదే రవ్వలు పొదిగి వున్నాయి. బంగారు చైనే. ధగధగలాడుతుంటే చూశా'' అన్నదో టీనేజరు.

''పట్టుబడ్డారా హంతకులు?''

''లేదింకా. ముగ్గురు. అప్పా తమ్ముడు భర్తా''

ఒక వయసు మళ్లిన గొల్లామె, కన్నీళ్లు చేతితో నెట్టేస్తూ, రెండో చేతిలో కర్ర, తల వణుకుతున్నది. తలంతా నెరిసింది. వణికే గొంతుతో అన్నది. ''చెప్తే విన్నది గాదు. చౌక అని చూసింది. బాబు వద్దన్నాడు. ఆ కొత్త మొహాలు మన

రాష్ట్రం వాళ్లు కారని చెపుతున్నాయి. కాందిశీకులేమో శ్రీలంకలో పరిస్థితులు బాగా లేవు. హత్యకు గూడా వెనుకాడరు. పారిపోయి వచ్చినవాళ్లు. బతుకు తెరువుకి వెతుకుతున్నారేమో. ఒక కంట్రాక్టరు రోజూ కూలీకి కుదిర్చాడుట. కూలికెళ్లద్దూ? పనెట్లా చేస్తారూ ముగ్గురూ? తమ్ముడు తోటమాలీ. మొగుడు కారు షెడ్డు శుభ్రం చేస్తాడు. కింద అద్దెకున్న వారిక్కూడానూ. పెళ్లామేమో పాచి పనీ, అంట్లు తోమటం, కూరలు కోసి యివ్వటం. బెడ్ రూమ్స్ కడుగుతుంది. బట్టలారేసి వెళ్తుంది పనికి. సాయంత్రం దాకా రారు ముగ్గురు. జీతమక్కర్లేదు. పాకలో వుండనిస్తే చాలు. దీపం, కొళాయి వున్నాయి. పాత గుడ్డలిస్తే చాలు అన్నారుట'' యింకా చెప్పుకెళ్తున్నది.

'' ఇంట్లో యెవరూ లేనప్పుడు తలుపులేసుకోదూ?''

''తానాల గదిలో దాగాడేమో తమ్ముడు, సన్నం పొట్టీ. ఇరవై యేళ్లున్నా పిల్లగాడల్లే కానవస్తాడు. కిటికీలోంచైనా దూరి రావచ్చు''.

''యెన్నాళ్లైందీ పనికి కుదిరి?''

''పదిపదేను దినాలైందేమో. దినచర్య గమనించి, అద్దెకున్న వాళ్లూ లేకపోవటం గమనించి, నక్కి నక్కి లోన దూరి, పనికానిచ్చి, గుభీలున పరారైనారేమో. పొద్దునైపాయె. అంతా పన్ల మీదుంటారు''.

''గోద్రేజ్ బీరువా తీసి రొక్కం మూటగట్టుకున్నారు పట్టుచీరలూ విరజిమ్మి పడేశారు. వెండిబంగారం లంకించుకున్నారు. పనిలోకి వెళ్తున్నట్టు వెళ్లిపోయి వుండాలి''.

''పెట్టి వుంది గదూ. ఇయాల కాకపోతే రేపైనా పట్టుబడతారు. విదియనాడు కనబడని చంద్రుడు తనకు తానే కంటబడతాడు. అడదాన్ని ఒంటరిగా పంపరూ గదూ. మరొకరు పట్టుకోవచ్చని తోడుంటారు''

''కథలో చెప్పింది, కొత్తవారిని నమ్మరాదనే మాట ఋజువైంది''.

''కాకులు పాముకాశ్రయమిస్తే రోజూ గుడ్లు మింగేసిదిట''.

''తాను చదువుకున్నానని బొమ్మ చెప్తున్నది''.

జనం పల్చబడుతున్నారు. మేడలోకి పోనీయటం లేదు రక్షక దళం. వసంత నించోలేక వెనక్కు తిరిగింది. టైమ్ చూసుకుంటూ వచ్చేస్తుంటే కండక్టర్ రాజు యెదురుగా వచ్చాడు.

''బస్సు బయలుదేరబోతున్న దమ్మ నేను పోవాల. ఆటో ఆపి వుంచాను. సంచులు సర్దిపెట్టాను. రండి. నడవలేరని ఆటో ఆపాను''. వెంట నడిచి బండి యెక్కించి బాడుగ చెప్పాడు. బస్ స్టార్ట్ అయింది. వెళ్లిపోయాడు.

వసంత రెండు ప్లాస్టిక్ సంచులతో యింట్లో అడుగుపెడితే, యింట్లోనూ జనులు కంటబడ్డారు.

అన్న శేఖరం నర్సింగ్ హోమ్ నడుపుతున్నాడు. కొడుకు ఫణి మెడిసిన్ చివరి సంవత్సరం. వదినకి మెనింజైటిస్ వచ్చింది. తీవ్రమై యింట్లోనే పోయింది. నక్షత్రం మంచిదిగాదని యిల్లు ఆర్నెల్లు మూసేయమన్నాడు పురోహితుడు. కర్మలు సత్రంలో జరిపారు. కూతురు విమల భర్తతో స్టేట్స్‌కి వెళ్లిపోయింది. వసంత అన్నను మేనల్లునీ తనయింట్లో వుండమన్నది. ఇంటికి కాపలా పెట్టాడన్న. అన్న అత్తారూ వైజాగే వస్తూ పోతూ వుంటారు. అన్న స్నేహితులు, వారి భార్యలూ, యితర పేషంట్సూ యిల్లు సందడిగా వున్నది. అయిదు నెలలైంది. సందడి పెరిగింది. ఇంకొక్క నెల గడవాలి. పోలీసుశాఖలో ఆఫీసర్స్ తెలుసు అన్నకి. సివిలియన్ దుస్తుల్లో వస్తూ వుంటారు ఆఫీసర్సు.

హాల్లో ఆసీనులైన వున్న స్త్రీలు తలోమాటా అంటూ గలాభా చేస్తున్నారు. ఒకామె వచ్చి వసంత చేతిలోని బరువైన సంచీలందుకుని స్టోర్ రూమ్‌లో వుంచి వచ్చింది.

''విన్నావా వదినా? దారుణం జరిగింది. అపుడే వార్త వ్యాపించింది''

''పొదుపరి అని పేరుబడింది డిసీజ్డ్. కాకికి యెంగిలి చేయి విదిలించేదిగాదు''.

''పిల్లికి బిచ్చం పెట్టేది గాదు''.

''యెంతసేపూ రామ్మ. రామ్మే''

''జీతం నాతం లేదని ఆలోచనా సాలోచనా లేకుండా ఎంగేజ్ చేసుకున్నది. మొగుడు మొత్తుకుంటే చెవిలో దూరలేదు. కైకమ్మలాగా తనమాటే నెగ్గించుకున్నది''.

''అసలెవరి మీదున్నదిటా దానికీ? మొదటి కూతురు పెళ్లి చౌకగా, చాకిరీ లేకుండా తిరుపతిలో జరిపించింది. తల్లిదండ్రులు వృద్ధులైనారు దూరాభారం. రాలేకపోయారన్నది అడిగితే. వియ్యాలవార్ని మెప్పించామన్నాది. యెంతవరకు నిజమోమరి''.

''మా యింటికొచ్చేవారు తల్లీకూతురూ, పుస్తకాల షెల్ఫు కెలికి, కనీసం పదిపుస్తకాలు, పత్రికలు, చందమామా, బాలమిత్ర, యువ కట్టకట్టి సంచీ యిమ్మని దానిలో కూరి తీసికెళ్లేది. నేను పేరంటం వెళ్లినప్పుడు అవన్నీ సంచీతో సహా చేతికందించి, ''తీసికెళ్లు చినిగిపోతాయి'' అన్నది. తెచ్చి యివ్వచ్చుగా. నౌకర్లుండెగా నేనేమనక నవ్వి, అక్కడే బల్లమీద నవలకంటబడితే తీశా. గార్డెనర్ నవల చిన్నదే పెర్రీ రూసన్ డిటెక్టివ్. ''సాయంత్రం తెచ్చియ్యి'' అన్నది. కూతురు వంత పాడింది''.

''అంతేనా. ఇంకా వున్నాయి అసలు రంగులు. మామగారి తద్దినం పెట్టాలిట. ఓ వేపు యిల్లు కట్టిస్తున్నారు. సూపర్‌వైజ్ చేయాలిట. తద్దినమొస్తున్నదని మరిచిందట. అప్పు పెట్టమని, బెల్లం, నెయ్యి, బియ్యప్పిండి నువ్వులూ అలా సరుకులన్నీ తీసికెళ్లింది. ఆమెకె మిస్టీ గుర్తులేక ఫ్రెండ్లీగా మాట్లాడుతూ నవ్వుతూ అన్నా. ''గొప్ప ఆఫీసర్ జాయింట్ కలెక్టరు భార్య అయివుండీ, ఆవకాయ ముష్టెత్తుకుంటారా?''.

''సరిగ్గా వూరగాయవేసే టైమ్‌కి. బదిలీ అయివచ్చేశాము. సెటిల్ అయ్యేప్పటికి సీజన్ ముగిసింది. ఆవకాయలేనిదీ అన్నం తిన్నట్టే వుండదు.

జాడీలో పెట్టి పంపమన్నది జానికమ్మ'' అని నవ్వి ''ప్రియా పచ్చళ్ల కొనుక్కోవచ్చునే. ముష్టెందుకూ'' అన్నా.

''నిన్నూ అడిగిందీ. నన్నడిగితే చిన్న జాడీనిండా నింపి యిచ్చా. పాతదేననుకో. నీవు కొత్తదిచ్చావాయేం? నాకూ్కూడా యియ్యి. మేం ఆవకాయ పెట్టాంగానీ, నెలవరకూ జాడీ మూత తియ్యం'' అన్నది. ''నాల్గోనాడు తిరగదియ్యరా?'' అని నవ్వాను. వాసనొస్తుందే కలియబెట్టకపోతే'' అన్నా.

''నెలకి బాగా నానుతుంది కొత్తముక్క. ఇపుడే యిస్తావా పట్టుకెళ్తా'' అంటే యిచ్చా. అదిగాదు విశేషం, జాడీ పంపలేదు. ముక్కలయిపోయాక పంపుతానని ఫోన్ చేసింది. రెండో కూతురు రోజూ ఓముక్క తింటున్నదిట. ముక్క చాలా రుచి అన్నదట కూతురు. దేనికో రమ్మంటే వెళ్లాను. జాడీచూపించి, ''తీసికెళ్లు మాదీ రుచిచూడు'' అన్నది. ఆ రాత్రి భోజనాల సమయంలో జాడీమీది మూత తొలగిద్దును గదా వెల్లుల్లీ యింగువా వాసన గుప్పుమన్నది. వూరగాయ నిరుటిదేమో ముక్క గుజ్జులాగా అయింది'' సావిత్రి ఆడపడుచు నవ్వాపుకున్నది.

'' ఆవకాయలో యింగువ ఆశ్చర్యం లేదండీ. కోస్తా ప్రాంతం వారూ వేసుకుంటారు. వుల్లి ఆవకాయ మెచ్చుతారు. కాని కొత్త వూరగాయ పల్ల గోంగూరపచ్చడిలో గూడా వేసింది వెల్లుల్లి యింగువా. చింతకాయ వూరగాయ జలుబు చేస్తుందని యింగువ వేయించి తాలింపుతో నూరుతారు. గోంగూరలో అనవసరం. అదీ స్టైల్''.

''పోదామా?'' అంటూ ఆమె భర్త వచ్చాడు'' లంచ్‌టైమ్. పోతాం'' అని లేచింది.

''లంచ్ కానిచ్చే వెళ్లండి. ఎలక్ట్రిక్ కుక్కర్ కొత్తగా కొన్నారని దానితో వండాను. అన్నం యెలా వుందో తిని చూడాలి మీరు'' అన్నది వసంత.

అందరూ సాయపడ్డారు. టేబిల్ మీల్సు కానిస్తూ, స్వేచ్ఛగా రెండోసారీ మూడోసారీగూడా సర్వ్ చేసుకుంటూ, అంత స్వేచ్ఛగానూ వింతలూ విశేషాలూ

చెప్పుకున్నారు.

''తిరుపతిలో అయితే, చౌక అనీ శ్రమ తక్కువనీ తక్కిన సంతానానికీ పెళ్లిళ్ల చేశారా, బిల్ చూసి తప్పుపట్టి యెక్కువైంది ఖర్చు, అంచనాను మించిందన్నది హితురాలు. దేవాదాయ, ధర్మాదాయ అధికారి హెడ్ క్లర్కును పిలిచి ఆమె యెదుట లెక్కలు దిద్దమన్నాడు. మళ్లా లెక్కలు వేయమన్నాడు. వాడు మళ్లా వివరంగా లెక్కలు వ్రాసి కూడుతూ బిల్స్ చూపుతూ వెళ్తే మొదటి మొత్తం కన్న రెండువేలెక్కువే అయింది ఖర్చు అని తేలింది''.

''తీసేశాను సర్. వారినే చూడమంటే మంచిది. నేను తగ్గించే పద్దు వ్రాశాను''.

హితురాలు మళ్లా చూసింది లెక్కలు కళ్లద్దాలు నిజం చెప్పాయి. మరో రెండు వేలెక్కువే ఖర్చు అయిందని తేలింది. మొహం ముడుచుకుని చిట్లించి మారు రిమార్కు లేకుండా నిర్గమించింది. అన్ని శ్రద్ధగా మానేజ్ చేసిపెడ్తే మిగిల్చిందేమనగా కరప్ట్ క్లర్క్ అని''

మరో పెద్దమనిషి పెరుగన్నం కానిస్తూ సద్దేశాడు.

''యేదో పోనీయండి. పోయిన వారిని గురించి చెప్పేదేమీ లేకపోతే. గప్‌చిప్‌గా వుండిపోవాలని ఒక యింగ్లీషు సామెత వున్నది''.

3

''యెవరి గతీ యెటుల వున్నదో యెగసి యెగసి పడుతేగాని'' అని గుడ్డి బిచ్చగాడు డబ్బా వాయిస్తూ వాకిట్లో నిలబడి పోతే రాత్రి మిగిలిన అన్నం, వూరగాయా పొట్లాలుగా కట్టి సంచీలో వుంచి బిచ్చగాడికిచ్చింది వసంత. బిచ్చగాడు వెళ్లిపోయాడు.

లోపలికొచ్చేప్పటికి భర్త సత్యం, ఆదివారమని బెడ్‌రూమ్‌లో బెడ్‌మీదుండి దినపత్రిక విప్పి చూస్తున్నాడు. వసంత లోపలికొచ్చి హాలులోంచి కిచెన్‌వేపు వెళ్లటం కంటబడింది. పత్రిక కిందబడింది. పక్కకు వంగి పత్రిక తీసుకోలేదు.

హత్య జరిగి అది నాలుగవ రోజు.

''వసంతా! నువ్వు మార్కెట్ నించి వస్తూ హత్య జరిగిన యింటివేపు వెళ్లి వచ్చానన్నావు. కొన్ని చెప్పావు. హతురాలి పేరేమిటి?'' అనడిగాడు సీలింగ్ వంక చూస్తూ.

''రామ సీత'' అని కిచెన్ వేపు వెళ్లింది వసంత. వసంతా అయేప్పటికి పదకొండైంది. ఇద్దరు మగపిల్లలూ స్నేహితులతో క్రికెట్ ఆడటానికి వెళ్లారు. ఇద్దరు చిన్నవాళ్లు జామ చెట్టెక్కి కూచుని కబుర్లాడుతున్నారు. జామచెట్టుకి పిందె పక్కన ఖాళీస్థలంలో పాకవేసుకున్న పూజారి దంపతుల బిడ్డ ''మెరుగు బంగారంబు మింగబోడు. కూడబెట్టిన సొమ్ము కుడువబోడు'' అని పద్యాలు వల్లిస్తున్నాడు. పదో ఏడు.

వసంత సోఫాలో కూలబడి దినపత్రిక మొదటి పేజీ చూసింది. ''రామ సీత అనే గృహిణిని, ఆమె పనివారు, పనిలో చేరిన పదిరోజులకే హత్య చేసి లక్ష వరకు నగదు సొమ్ము చేజిక్కించుకుని పరారి అయినారు. పనివారు రోజుకూలీ చేసుకునేవారు. ఆ రోజున కాంట్రాక్టరు యివాళ పనిలేదన్నాడని, పాకలోనే వుండి పోయామన్నారు. ఇంట్లో ఒక్కతే వుండగా వచ్చి, ''కొళాయి నీరు రాలేదనీ మంచినీళ్లు పొయ్యమని ప్లాస్టిక్ బిందె తెచ్చారు. గృహిణికి అతి వినయం ధూర్త లక్షణం అని తెలియకేమో వారి వినయం, అనుకూలత, వంగి దణ్ణాలు పెడుతూ మసులుకున్నారు గనక, తలుపు గొలుసు తీయకుండా కొద్దిగా తీసివుంచేలోనికి వెళ్లగానే, గొలుసు పగలగొట్టి లోనికి వెళ్లి గృహిణిని పట్టుకున్నారు. పెడరెక్కలు విరిచి కట్టారు. నోట్లో గుడ్డలు కూరారు. పనికానించారు. గుర్తిస్తుందని నైలాన్ తాడు గొంతుకు బిగించి హత్య చేశారు. వివరాలు వివరంగా సేకరించిన పోలీసువారు, విమానాశ్రయం, రైల్వేస్టేషన్, బస్ స్టాప్‌లు, బస్ రూట్లు సివిలియన్ దుస్తుల్లో కాపు వేశారు. నాల్గవ రోజున విజయవాడ స్టేషన్లో రైలుకోసం యెదురు చూస్తూ ముగ్గురూ పట్టుబడ్డారు. చెన్నై వెళ్లి అక్కడినించి రామేశ్వరం వెళ్లి పడవలో కొలంబోగానీ శ్రీ లంకగానీ చేరాలని

పథకం. వయసు యెత్తు, యాస భాష, స్త్రీ చేతిలో పెట్టె, రెండువేపులా దగ్గరగా తమ్ముడూ భర్తా, బిత్తర చూపులు, ఆదుర్దా వారిని పట్టిచ్చాయి. పని సుకరమైంది'' అని చదువుతుండగా సంగీతం లెక్చరర్ సునీత, వసంత డాక్టర్ అన్నను కన్సల్ట్ చేయటానికి వస్తూ వుండేది లోపలి కొచ్చింది.

యింటికి రెండోవేపున్న డాబాలో అమ్మాయి రికార్డు వింటున్నది. ''పోయేటప్పుడు వెంబడి రాదూ పూచీ పుల్లైనా'' గాలి వాటానికి వినవచ్చింది.

తలెత్తి చూసి వసంత అన్నది ''అలా కూచోండి. గొంతు నెప్పి తగ్గుతున్నదా? డాక్టరన్న సింహాచలం వెళ్లాడివాళ పొద్దున. లింగరాజుగారు వచ్చి కారులో తీసికెళ్లారు''.

సునీత సోఫాలో కూచుని అడిగింది. ''యేదో సీరియస్‌గా చదువుతున్నారే? నా అడుగుల చప్పుడు వినబడలేదా? కుక్క అరుపూ వినలేదు. విచారంగా కనిపిస్తున్నారు. దుర్వార్త కంటబడిందా?''

మారుమాట లేకుండా దినపత్రిక అందించింది వసంత.

సునీత చదివి ఆశ్చర్యపోయింది. కలవరపడింది.

''మీకామెబాగా తెలుసా? మీరూ కలవరపడ్డారే?'' అనడిగింది వసంత.

''నేనూళ్లో లేనండీ, పిల్లలతో పిక్‌నిక్‌కి వెళ్లి వచ్చాను. నేనింకా వినలేదు. ఆమె తెలుసేమిటీ? నేను వారి అమ్మాయిలకి రెండేళ్లు సంగీతం నేర్పాను. రేపు పెళ్లి అనేవరకు చెప్పాలన్నది. పెళ్లివారలా షరతు పెట్టారుట. సరేనన్నా. పెళ్లికి యెలా ఆహ్వానం అందిందంటే ఒకప్యూను వెడ్డింగ్ యిన్‌విటేషన్ని గేటు దగ్గర నిలబడి మెట్లమీదికి విసిరేశాడు. పేపర్‌బోయ్ పేపర్‌కి తాడుగట్టి విసిరేస్తాడు చూడండీ అలా. రాత్రి పదిన్నరకి ఫోన్ చేసిందా యిల్లాలు. '' ఆహ్వానం అందిందా? బస్సెక్కి వస్తే దిగువ తిరపతిలో దిగి'' అంటుండగా ఫోన్ డిస్‌కన్నెక్టయింది. నేను గాత్రమేగాక వీణా నేర్పుతానని తెలిసి తనకూవీణావాదనం వచ్చున్నది.

''యెంతవరకూ నేర్చుకున్నారు? యెన్నేళ్లు నేర్చుకున్నారు?'' అనడిగాను.

''ఏమేం? బాగానే నేర్పాను. తానం వాయిస్తుంటే తప్పుపట్టగలను. నీ దగ్గర నాలుగు వీణలున్నాయని చెప్పింది మా అమ్మాయి. పెద్ద వీణ తంజావూరు వీణ పంపించు. ఆ వీణ కిటికీలో వుంచి యిల్లు కడుగుతున్నది పనిమనిషి. పిల్లి దాని మీదిగా దూకితే వీణ కిందబడి రెండు మెట్లు వూడినై. నేను రోజూ పాడుతూ వాయించుకుంటాను. మరిచిపోతానేమో. అన్నట్టు నువ్వు మేళం కట్టగలవని మా రెండో అమ్మాయి చెప్పింది. వీణ మెట్లు దిద్దుతూ బాగు చేస్తుంటే చూసింది. నీ వీణా బాగు చేయించుకో అన్నది అమ్మాయి. తొందరేం లేదు. శలవుల్లో వచ్చి బాగు చేయి'' అన్నారండీ ఆ యిల్లాలు''.

''పంపారా వీణ?'' అనడిగింది వసంత.

''లేదు సుమండీ. వీణ తెమ్మని జమాన్ని పంపింది''.

''వీణ యిస్తా మనిషిని పంపమన్నారుట. యిస్తే పోతా'' అని నిలబడ్డాడా ప్యూను. ''నేననలేదు. అవి నా స్టూడెంట్సు వీణలు. వాళ్లు వచ్చి సాధన చేసుకోవాలి'' అని పంపేశానండీ ప్యూన్ని. ''కొంత స్థిమితపడి మళ్లా అన్నది సునీత. ''గొంతు నెప్పి తగ్గింది. పాటపాడనిస్తున్నదండీ. మీ అమ్మాయి కమల స్కూలులో జరిగిన పోటీలో ఫస్టు వచ్చి బహుమతి తెచ్చుకున్నది. స్కూల్ అనివర్సరీకి కమల మళ్లా వేదిక మీద బృందగానంలో పాల్గొంటుంది. మీరు రావాలి. నేను వచ్చి తీసికెళ్తా నమస్తే'' అని చేతులు జోడిస్తూ లేచింది సునీత.